RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
గురువారం । 16 । జూలై । 2026

## నేటి మంత్రి పొంగులేటి కొత్తగూడెం నియోజకవర్గం పర్యటనను జయప్రదం చేయండి

- డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల ప్రభాత్ నగర్ వంతెన ప్రారంభోత్సవ పనులను పరిశీలించిన కొత్వాల



పాల్వంచ, జూలై 14 (తెలంగాణ వాణి)

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేడు కొత్తగూడెం నియోజకవర్గంలోని పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాలలో పర్యటించి, పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మండల పరిధిలోని ప్రభాత్ నగర్ (రెడ్డిగూడెం) లో నిర్మించిన వంతెన నిర్మాణ పనులను బుధవారం కొత్వాల పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ మంత్రి పొంగులేటి సాయంత్రం 3 గంటలకు చంచుపల్లి మండలం విద్యానగర్ లోని క్యాంపు కార్యాలయంలో పాల్గొని, కొత్తగూడెంలో పలు అభివృద్ధి పనులలో పాల్గొంటారన్నారు. సాయంత్రం 3.50 గంటలకు ప్రభాత్ నగర్ లో వంతెనకు ప్రారంభోత్సవం, సాయంత్రం 4.20 గంటలకు పాల్వంచ దమ్మపేట సెంటర్ లో రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, సాయంత్రం 4.40 గంటలకు మంచికంటి నగర్ లోని, సాయంత్రం 5 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం, భూ భారతిపై సమీక్షా, రాత్రి 7.15 గంటలకు విద్యానగర్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లాకు చెందిన శాసనసభ్యులు, అధికారులు పాల్గొంటారన్నారు. కావునా ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కోండం వెంకన్న, వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నలుగురు నిందితులు అరెస్ట్

మూడు ఆటోలు, సెల్ ఫోన్లు స్వాధీనం

మరో ఇద్దరు నిందితులు పరారీకొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ



కొత్తగూడెం, జూలై 15 (తెలంగాణ వాణి)

కొత్తగూడెంలో మైనర్ బాలిక పై జరిగిన లైంగిక దాడి ఘటనలో ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు కొత్తగూడెం డిఎస్పి ఎల్.ఆదినారాయణ తెలిపారు. బుధవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఓ మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి వెంటబడి ఆటోలో ఎక్కించుకుని లైంగిక దాడికి పాల్పడడంతో పాటు అతని స్నేహితులతో కూడా లైంగిక దాడి జరిగేలా ప్రేరేపించి, ఆమె జీవితాన్ని చీకటిలోకి నెట్టారన్నారు. ప్రధాన నిందితుడు రామకృష్ణ తన స్నేహితులు జాలే నవీన్, గణేష్ ల సహకారంతో ఈ నెల మూడో తేదీన మైనర్ బాలికపై లైంగిక దాడి చేశారని తెలిపారు. అనంతరం లైంగిక దాడి విషయాన్ని అతని రామకృష్ణ స్నేహితులైన కలకుంట్ల విజేందర్, బడేటి మహేష్ లకు కూడా చెప్పాడన్నారు. దీనిని అదునుగా భావించిన విజేందర్, మహేష్ లు బాలికను భయపెట్టి వేరువేరు రోజుల్లో లైంగిక దాడి చేశారని వివరించారు. ఈ నెల 4న బడేటి మహేష్, అదే విధంగా అయిదో తేదీన విజేందర్ వేర్వేరు ప్రాంతాలకు తీసుకువెళ్లి బాలికపై లైంగిక దాడికి చేసినట్టు తెలిపారు. వీరి నుంచి బెదిరింపులు అధికం కావడంతో చేసేది లేక మైనర్ బాలిక తన తల్లికి ఈనెల 11వ తేదీన జరిగిన సంఘటనను వివరించిందని స్పష్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే బాలిక తల్లి అదే రోజు టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేసిందన్నారు. దర్యాప్తులో భాగంగా బుధవారం నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి మూడు ఆటోలు మూడు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుల్లో మారుతి రామకృష్ణ, కలకుంట్ల విజేందర్, బడేటి మహేష్, జాలే నవీన్ లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు నిందితులు గణేష్, వెంకటేష్ లు ప్రస్తుతం పరారిలో ఉన్నారని తెలిపారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా డీఎస్పీ చెప్పారు. సాంకేతిక ఆధారాలు, బాధితురాలి వాంగ్మూలం, సీసీటీవీ ఫుటేజ్, ఇతర కీలక ఆధారాల సహాయంతో నలుగురు ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు పరారీలో ఉన్న మరో ఇద్దరి పాత్రపై కూడా విచారణ కొనసాగుతోందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టూ టౌన్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ఏఎస్ఐ రాజుతో పాటు సిబ్బంది రాములు, హతిరామ్, కోటి లు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్ల నిబంధనల ఉల్లంఘనపై పోలీసుల ప్రత్యేక డ్రైవ్

36 వాహనాలపై కేసులు.. రూ.7,510 జరిమానా

కొత్తగూడెం, జూలై 15 (తెలంగాణ వాణి)



కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు బుధవారం నంబర్ ప్లేట్ల నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు అమర్చిన వాహనాలను గుర్తించి తనిఖీలు చేపట్టారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో నిబంధనలను ఉల్లంఘించిన 36 వాహనాలపై కేసులు నమోదు చేసి, మొత్తం రూ.7,510 జరిమానా విధించి వసూలు చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి వాహన యజమాని నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్లను వక్రీకరించడం, అంకెలను మార్చడం లేదా కనిపించకుండా ఉంచడం చట్టవిరుద్ధమని, అలాంటి ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. రోడ్డు భద్రతను మరింత పటిష్టం చేయడంలో భాగంగా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్

ఏ నియోజకవర్గంలో మాజీ మంత్రి వనమా ఎంతో అభివృద్ధి చేశారు

ప్రతి ఒక్కరికి అండగా ఉంటాం

ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని వదులుకోవద్దు

బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వనమా రాఘవేంద్రరావు




పాల్వంచ, జూలై 15 (తెలంగాణ వాణి)

కొత్తగూడెం నియోజకవర్గంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాల్సిన తరుణ ఆసన్నమైందని ఆ పార్టీ సీనియర్ నాయకులు వనమా రాఘవేంద్రరావు పేర్కొన్నారు. గురువారం పాల్వంచలోని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు ఇంటి వద్ద పార్టీ నాయకులు కిలారు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలు అందించిన సహాయ, సహకారంతో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఎంతగానో అభివృద్ధి చేశారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ నాయకత్వంలో మరోసారి తిరుగులేని మెజారిటీ సాధించడం ఖాయమని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా సాగు, తాగు నీరు, అందించకుండా రైతాంగాన్ని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని అభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్ కె దక్కుతుందన్నారు. సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం మోకా లడ్డిందని విమర్శించారు. కొత్తగూడెం నియోజకవర్గం లోని మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావుకి దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా తాగునీటి సమస్యను పరిష్కరించడంలో వనమా ఎంతో కృషి చేశారన్నారు. కోట్లాది రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో కొత్తగూడెం కార్పొరేషన్ కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే కూనంనేని కృషితో ఫోర్ లైన్ రోడ్డు మంజూరు

- 14 కోట్లతో ధమ్మపేట రోడ్డు అభివృద్ధి

- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

పాల్వంచ (తెలంగాణ వాణి)

కొత్తగూడెం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక చొరవతో మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు సాకారమైంది. నియోజకవర్గ పరిధిలోని ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఆయన చేసిన కృషితో ధమ్మమేట రోడ్డు అభివృద్ధికి మోక్షం లభించింది. దమ్మపేట సెంటర్ నుంచి కుంటినాగులగూడెం వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర అధునాతన ఫోర్ లైన్ (నాలుగు వరుసల) రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయి. ఈ మెగా రోడ్డు నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం రూ.14 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలతో పాటు, అశ్వారావుపేట వైపు రాకపోకలు సాగించే వాహనదారుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఈ ప్రతిష్టాత్మక ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణ పనులకు అధికారికంగా శంకుస్థాపన ముహూర్తం ఖరారైంది. గురువారం నాడు జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. వారితో పాటు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతులమీదుగా ఈ పనులకు ఘనంగా శంకుస్థాపన నిర్వహించబోతున్నారు.



నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్లు, వంతెనల నిర్మాణంతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే కూనంనేని నిరంతరం శ్రమిస్తున్నారని ఈ నిధుల మంజూరు ద్వారా మరోసారి నిరూపితమైంది. ప్రజాపక్షంగా ఉంటూ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు కూనంనేని సాంబశివరావు గారు తెస్తున్న నిధులు, చేస్తున్న అభివృద్ధి పట్ల స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ నాయకులు కోరారు.

## ఓటు హక్కును కాపాడుకుందాం

రాష్ట్ర మైనార్టీ నాయకులు డా.నయీమ్ ఖురేషి

కొత్తగూడెం, జూలై 15 (తెలంగాణ వాణి)



రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు కేవలం ఒక హక్కు మాత్రమే కాదని పీడిత ప్రజల గొంతుక అని హక్కులను కాపాడే ఒక గొప్ప ఆయుధమని రాష్ట్ర మైనారిటీ నాయకులు డాక్టర్ నయీమ్ ఖురేషి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతేగాక సమాజం మార్పు కోసం పారదర్శకమైన ప్రజాస్వామ్యం కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును రక్షించుకోవాలని సూచించారు. అయితే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సామగ్ర సవరణలో భాగంగా మీ అమూల్యమైన ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే తన ఆఫీసులో సహకారం పొందే విధంగా ఏర్పాటు చేశామన్నారు.

## తాడిచర్ల-2 బ్లాక్ సాధన విజయోత్సవం



పాల్గొన్న సింగరేణి డైరెక్టర్ సంస్థ భవిష్యత్తుకు కీలక మైలురాయిగా అభివర్ణన

కొత్తగూడెం ఏరియా పీవీకే-5, ఆర్‌సీహెచ్‌పీలో వేడుకలు

కొత్తగూడెం సింగరేణి, జూలై 15 (తెలంగాణ వాణి)

తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజు మంజూరు సందర్భంగా కొత్తగూడెం ఏరియాలో బుధవారం విజయోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని పీవీకే-5 ఇంక్లైన్, ఆర్‌సీహెచ్‌పీలో జరిగిన ఈ వేడుకలకు సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేమ్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాడిచర్ల-2 బ్లాక్ సాధన సింగరేణి సంస్థ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ విజయోత్సవం సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి నూతన దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. సంస్థ పురోగతికి ప్రతి ఉద్యోగి సమిష్టిగా కృషి చేయాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.జీఎం ఎం. షాలేమ్ రాజు




మాట్లాడుతూ తాడిచర్ల-2 బ్లాక్ మైనింగ్ లీజు సాధనతో సింగరేణికి సుస్థిర భవిష్యత్తు ఏర్పడిందన్నారు. సంస్థ అభి వృద్ధి, కార్మిక సంక్షేమం, కొత్త బొగ్గు గనుల సాధన, ఉత్పత్తి వ్యయ నియంత్రణ, ఆధునిక సాంకేతిక వినియోగం, పునరుత్పాదక ఇంధన రంగ విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సంస్థ పురోగతికి కట్టుబడి ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో వీకేసీఎం ప్రాజెక్టు అధికారి ఎం.వి. నరసింహారావు, ఎస్టేటు జీఎం ఎం. గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, పీవీకే ఏజెంట్ రామ్ భరోస్ మెహతో, పీవీకే-5 మేనేజర్ రవి కిరణ్, ఏరియా ఇంజినీర్ వి. రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, పీవీకే వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్, ఇంచార్జ్ ఆర్‌సీహెచ్‌పీ యశస్వి, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ భూక్యా రమేష్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ చిలక రాజయ్య, గని అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న చుంచుపల్లి గ్రామ పంచాయతీ





కొత్తగూడెం, జూలై 15 (తెలంగాణ వాణి)

జిల్లాలోని చుంటిపల్లి మండల పరిధిలోగల బాబుక్యాంప్ వైకుంఠంధామంలో ప్రతినిత్యం చుంచుపల్లి పంచాయతీ చుట్టు పక్కల సెకరించిన చెత్తను తగలబెడుతున్నారని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు వైకుంఠధామం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ముందే ఉందని ఆ ప్రాంతవాసులు వెల్లడిస్తున్నారు. అంతేగాక పక్కనే సిఎంపిఎఫ్ ఆఫీస్, పక్కన ఒక పాఠశాల, ఐటిఐ, గొదుమ వాగు పక్కన వందాలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. వ్యర్థాలు తగలబెట్టడం వల్ల వెదజల్లే కాలుష్యం దుర్వాసన మూలంగా విద్యార్థులకు కళ్ళ మంటలు, శ్వాసకోస సమస్యలు వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కలెక్టర్ , కొత్తగూడెం కార్పోరేషన్ మేయర్, కమిషనర్, పంచాయతీ సెక్రటరీ , కాలుష్య నివారణ యంత్రణ ఆధికారులు జోక్యం చేసుకొని వ్యర్థాలు తగల బెట్టకుండా నిలువరింప చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. అంతేకాకుండా తమ ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు.

# అమరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

- ఘనంగా రాయల చంద్రశేఖర్ 2వ వర్ధంతి

కొత్తగూడెం, జూలై 15 (తెలంగాణ వాణి)

రాయల చంద్రశేఖర్ 2వ వర్ధంతిని ఉమ్మడి కొత్తగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి పెద్దబోయిన సతీష్ మాట్లాడుతూ తన కోసం తాను బతకకుండా సమాజంలోని బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి రాయల చంద్రశేఖర్ అని కొనియాడారు.పోడు భూముల సమస్య పరిష్కారం కోసం గిరిజన గ్రామాలు తిరుగుతూ గిరిజనులను ఏకం చేసి భూ పోరాటాలు నడిపారని గుర్తు చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారని తెలిపారు. కోవిడ్ సమయంలో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతు పోరాటంలో తన వంతు పాత్ర పోషించిన చంద్రశేఖర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. ఆయన చూపిన బాటలో అందరూ నడవాలని రైతాంగానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు భానోతు ధర్మ, వై. గోపాలరావు, ఎస్.కె. యాకూబ్, షావలి, ఆజాద్, మండల నాయకులు సరోజ,




రాజశేఖర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

RNI NO: APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
గురువారం । 16 । జూలై । 2026

## ఎరువుల కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని

**యూరియా బుకింగ్ యాప్ వినియోగించుకోవాలని రైతులకు సూచన**




**చుంచుపల్లి, జూలై 15 (తెలంగాణ వాణి)**

చుంచుపల్లి మండల సంఘ కార్యాలయంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మండే వీరహనుమంతరావు మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, రైతులు నేరుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని యూరియా కట్టలు పొందవచ్చని తెలిపారు. సుజాతనగర్, ఏఎంసీ లక్ష్మీదేవిపల్లిలో ఇప్పటికే రెండు ఎరువుల కేంద్రాలు ఉన్నప్పటికీ, చుంచుపల్లి, కొత్తగూడెం మండలాల రైతులకు మరింత అందుబాటులో ఉండేందుకు చుంచుపల్లి హౌసింగ్ బోర్డులోని సొసైటీ కార్యాలయంలో కొత్తగా ఎరువుల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రెండు మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను మండల రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, డైరెక్టర్ కంటెం సత్యనారాయణ, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, షాబీర్ పాషా, చుంచుపల్లి ఏఓ రాజేశ్వరి, కొత్తగూడెం ఏఓ కరుణామయి, ఏఈఓ మమత, ప్రసాద్, చుంచుపల్లి సర్పంచ్ బి. వీరన్న, విద్యానగర్ కాలనీ సర్పంచ్ శాంతిశ్రీ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ రాంబాబు, కొత్తగూడెం ఏఎంసీ మాజీ అధ్యక్షుడు రాంబాబు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజకీయాల కోసం దేవుళ్లను వాడుకుంటున్న బిజెపి

**ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం అరాచకం రమణమూర్తిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్**




**కొత్తగూడెం జూలై 15 (తెలంగాణ వాణి)**

బిజెపి రాజకీయాల కోసం దేవుళ్లను వాడుకోవడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ అన్నారు. బి ఆర్ కే చానల్ లైవ్ డిబేట్‌లో విజయ విహార రమణమూర్తిపై జరిగిన భౌతిక దాడిని ఖండిస్తూ మంగళవారం శేషగిరిభవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...బి ఆర్ కే లైవ్ చర్చలో బిజెపి అనేది రాజకీయ పార్టీ అని, రాముడు, కృష్ణుడుని మతం పేరుతో వాడుకోవటం సరికాదు అన్నందుకు బిజెపి మతోన్మాది వెంటనే లేచి రమణమూర్తి మీద చేయి చేసుకోవడం సరికాదన్నారు. మోడీ ఇటీవల కాలంలో హైదరాబాద్ వచ్చినప్పుడు హిందువులు ఎంతో ఆరాధ్య దైవంగా కొలిచే శ్రీకృష్ణుడి చిత్రపటంలో శ్రీకృష్ణుడి శిరస్సును తీసేసి, అక్కడ ప్రధానమంత్రి మోడీ శిరస్సు పెట్టటం హిందువులకు ఎంతో అవమానకరమని, అది మా మనసుల్ని ఎంతో బాధ పెట్టిందని రమణమూర్తి అనడంపై కర్షపు రెడ్డి అనే వ్యక్తి వెంటనే దాడి చేయడం హిందువులకు, ఈ సమాజానికి ఎంతో బాధాకరమైన విషయమన్నారు. ఈ దేశంలో ప్రశ్నించేవాడు హిందువు అయినా సరే, వాడు మతోన్మాద శక్తులకు బలి కావాల్సిందేనా అని ప్రశ్నించారు. ఈ సంఘటన మీద ఒక బీజేపీ నాయకుడు కూడా ఇప్పటివరకు స్పందించకపోవడం విషాదకరమన్నారు. దేశంలో ప్రజా వ్యతిరేక బిజెపి పాలనలో అరాచకం పెరుగుతోందని, వీళ్ళు దేవున్ని, మతాన్ని కించపరిచినా మౌనంగా ఉండాలని, ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. వీళ్ళకి హిందువుల మీద, దేవుడి మీద, భారతదేశ ప్రజల మీద ప్రేమ లేదని, కేవలం కార్పొరేట్ శక్తులకు, అరాచక శక్తులకు కొమ్ము కాస్తూ ఈ దేశ సంస్కృతి సాంప్రదాయాన్ని పాడు చేసే వాళ్ళ మీదనే ప్రేమ ఉందని విమర్శించారు. ఈ దేశాన్ని ఎటు తీసుకెళ్తున్నారో వాళ్లకే తెలియాలని, ఈ దాడిని ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సంజయ్, పట్టణ నాయకులు సంతోష్ పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య బలోపేతమే లక్ష్యం

**- ఏటూరునాగారంలో వేగవంతంగా సార్ ఎన్యుమరేషన్ ఫారాల భర్తీ**



**ఏటూరునాగారం,జులై15(తెలంగాణ వాణి):**

ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏటూరునాగారంలోని ఓడవాడ 45వ బూత్ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సార్ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల భర్తీ కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. బూత్ లెవెల్ అధికారి అంగన్‌వాడీ టీచర్ లలిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లులు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 100 శాతం ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించేందుకు ప్రతి అర్హ ఓటరు సహకరించాలని కోరారు. ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రతి ఒక్కరూ సార్ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన సార్ ఎన్యుమరేషన్ ఫారాలను నింపించి సంబంధిత అధికారులకు అందజేశారు. దీంతో బూత్ పరిధిలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. .

## పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందస్తు ప్రణాళికతో ముందడుగు**

**1.73 కోట్లతో 10 రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం**






**పాల్వంచ, జూలై 15 (తెలంగాణ వాణి)**

పాల్వంచ పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ పట్టణంలో బుధవారం రూ.1.73 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు, ఇతర అభివృద్ధి పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శంకుస్థాపనల సభల్లో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 31, 33, 34, 36, 38, 42, 45 డివిజన్లలో ఈ నిధులతో మొత్తం 10 అభివృద్ధి, నిర్మాణ పనులను ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు వివరించారు. ప్రజలకు అత్యంత అవసరమైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, అందులో భాగంగానే ఈ నిధులను మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. పట్టణంలో మురుగు నీటి పారుదల వ్యవస్థను మెరుగుపరిచేందుకు డ్రైన్ల నిర్మాణంతో పాటు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు సిమెంట్ రోడ్లను నిర్మిస్తామన్నారు. ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా ఈ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపక్షం నిలిచే ఎమ్మెల్యేగా నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని, పాల్వంచ పట్టణ రూపురేఖలను మార్చడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేషన్ కమిషనర్ కె సుజాత, తహసిల్దార్ దారా ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏ డి ఈ అబ్దుల్ రెహమాన్, డిప్యూటీ కమిషనర్ విజయానంద్, టౌన్ ఎస్సై తోట నాగరాజు, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, నూనావత్ శ్యామల, గొర్లె అన్నపూర్ణ, సింధు తపస్వి, సుగుణ, నరేష్, మధుచంద్, విజయలక్ష్మి, సీపీఐ నాయకులు శనగారపు శ్రీనివాసరావు, గౌతమి కృష్ణ, శేఖర్ బాబు, గిరి, నాగమణి, రెహమాన్, ఆలపాటి ప్రసాద్, కరీం, కాకటి రవీందర్, దినేష్, నరేష్, నవీన్, అంజాద్, రామాచారి, బట్టు హరి, చరప శ్రీను, లక్ష్మి, రాజేశ్వరరావు, జిలానీ, భీమనాయక్, ఆదినారాయణ, అశోక్, వివిధ శాఖల డిఇలు, ఏఈలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లె ప్రశాంత్ నియామకం



**కమలాపూర్ తెలంగాణ వాణి ప్రతినిధి ( జులై 15 )**

హైదరాబాద్ లోని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యలయంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ అధ్యక్షతన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమీటి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ అతార్ సింగ్ రావు, విశిష్ట అతిథిగా సెంట్రల్ కోఆర్డినేటర్ సురేష్ ఆర్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అతార్ సింగ్ రావు రాష్ట్ర కమిటీ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లె ప్రశాంత్‌ని ప్రకటించారు. ఓబీసీ వర్గాలను, యువకులను, విద్యావంతులను పార్టీకి జోడించబంలో పల్లె ప్రశాంత్ కృషి చేయాలని ఉపేదేశించారు. తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన పల్లె ప్రశాంత్ ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాం కృష్ణ, జోన్ చీఫ్ ఇంచార్జులు దాగిల్ల దయానందరావు, నిషాని రామచంద్రం, బోడపట్ల ఈశ్వర్ లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జోన్ ఇంచార్జులు, పార్లమెంట్ ఇంచార్జులు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్ మరియు పలు జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## మాచనపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి జాతీయ స్థాయి నాణ్యత గుర్తింపు దిశగా కీలక ముందడుగు




**జమ్మికుంట, జులై 15, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**

జమ్మికుంట మండలం మాచనపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (పల్లె దవాఖాన)కు జాతీయ స్థాయి నాణ్యత గుర్తింపు సర్టిఫికెట్ ( ఎన్ క్యూ ఏఎస్ ) మంజూరు ప్రక్రియలో భాగంగా నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ ( ఎన్ హెచ్ ఎస్ ఆర్ సి ) అసెస్‌మెంట్ బృందం బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాణ్యత ప్రమాణాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆరోగ్య మందిరంలో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు అందుబాటులో ఉన్న మందులు, మౌలిక సదుపాయాలు, సేవల నాణ్యత, నిర్వహణ విధానాలు తదితర అంశాలను జాతీయ స్థాయి బృందం సమగ్రంగా పరిశీలించింది. పరిశీలన అనంతరం మాచనపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం జాతీయ స్థాయి నాణ్యత గుర్తింపు సర్టిఫికెట్ పొందే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. డిప్యూటీ డీఎచ్ఎంఓ డాక్టర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, హుజురాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని సబ్ సెంటర్లకు జాతీయ స్థాయి నాణ్యత గుర్తింపు లభించేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ టీం సభ్యులు కూడా హుజురాబాద్ డివిజన్‌లోని ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ టీం( ఎన్ హెచ్ ఎస్ ఆర్ సి )అసెసర్లు డాక్టర్ జయేశ్, డాక్టర్ లక్ష్మి, క్వాలిటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సనా జవేరియా, డాక్టర్ కార్తీక్, డాక్టర్ మహోన్నత్ పటేల్, సీహెచ్ఓ దిలీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, డీపీఓ స్వామి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్, క్వాలిటీ నోడల్ అసిస్టెంట్ నాగరాజు, క్వాలిటీ యూనిట్ సభ్యుడు అఖిల్, సూపర్వైజర్ సదానందం, ఏఎన్ఎంలు సావిత్రి, శ్యామల, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పించాలి

**- అదనపు కలెక్టర్ సి.హెచ్ మహేందర్ జి**

**ములుగు, జులై15 (తెలంగాణ వాణి)**



ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపేలా వ్యవసాయ,ఉద్యాన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సి.హెచ్ మహేందర్ జి. ఆదేశించారు. బుదవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీటి పారుదల శాఖ,వ్యవసాయ ,ఉద్యాన, భూగర్భ జల వనరుల శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితుల గురించి రైతులకు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వివరించి చెప్పాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎంత వరి పంట సాగు చేశారు? ఇతర పంటల సాగు ఎంత చేశారని ఒక నివేదిక తయారు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న సాగునీటి వనరుల ద్వారా గతేడాది ఎన్ని ఎకరాల్లో వరి సాగు చేశారు?. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయా సాగునీటి వనరుల చివరి డిస్ట్రిబ్యూటర్ వరకు నీళ్లు అందుతాయా?. లేదా అని అంచనా వేసుకొని రైతులకు క్లుప్తంగా తెలియజేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే భూ గర్భ జల వనరుల శాఖ ఇచ్చిన నివేదికలు ఆశించిన స్థాయిలో లేవని,పంటల మార్పిడి అవశ్యకత ఎంతైనా అవసరం అనే విషయం జిల్లా రైతాంగానికి అర్థం అయ్యేలా అధికారులు తెలియ చెప్పాలన్నారు. ఆయిల్ ఫామ్ అంటే కేవలం ఉద్యాన శాఖ కు సంబంధించినదే అని ఏఈవోలు నిర్లక్ష్యం చేయకుండా ఉద్యాన శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకం అని రైతులు తెలుసుకునే విధంగా అధికారులు ఆయిల్ ఫామ్ సాగు చేసిన రైతులతో ఇతర రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇక నుంచి ప్రతీ వారం వ్యవసాయ శాఖ అధికారుల డ్యూటీ చార్ట్ నివేదికను తనకు పంపించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మండలాల వారీగా వర్షపాతం,గతేడాది ఇదే సమయంలో సాగు చేసిన పంటల విస్తీర్ణం, ప్రస్తుతం సాగు విస్తీర్ణం ఎంత ? వచ్చే వారం పది రోజుల తర్వాత వాతావరణ పరిస్థితులు గురించి డఅదనపు కలెక్టర్ అధికారులతో చర్చించారు.

## కోహీర్‌లో రూ.11.20 లక్షల విలువైన పిడిఎస్ బియ్యం పట్టివేత




**జహీరాబాద్/కోహీర్: జూలై 15(తెలంగాణ వాణి ప్రతినిధి)**

పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో బుధవారం రోజు ఉదయం తనిఖీలు నిర్వహించారు. కోహీర్ మండల డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లైస్) గౌడిగామ బస్వరాజ్ కోహీర్ పోలీస్ సిబ్బందితో కలిసి ఎన్ హెచ్-65 కోహీర్ చౌరస్తా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జి జె 18 బి డబ్ల్యు 5818 నంబరు గల అశోక్ లేలాండ్ కంటైనర్ ను ఆపి తనిఖీ చేయగా, అందులో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆ వాహనంలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్ కలిగిన పిడిఎస్ బియ్యం మొత్తం 1166 సంచులు ఉన్నాయి. ఒక్కో సంచి 30 కిలోల చొప్పున మొత్తంసుమారు 350క్వింటాళ్లు, వీటి విలువ సుమారు రూ.11,20,000/- గా ఉంది. వాహనంలో ఎలాంటి చెల్లుబాటు అయ్యే అనుమతి పత్రాలు లేవు. పంచసాక్షుల సమక్షంలో బియ్యం మరియు వాహనాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపారు. బియ్యాన్ని వెయ్ బ్రిడ్జ్ చేయించి జహీరాబాద్ ఎం ఎల్ ఎస్ పాయింట్ ఇన్ చార్జ్ కు అప్పగించారు. వాహనాన్ని కోహీర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కి అప్పగించారు. విచారణలో వాహన డ్రైవర్ రాయ్ చంద్ మాట్లాడుతూ, జగ్గుపర్తి ముక్కటేశ్వరరావు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, యజ్ఞవతి రైస్ మిల్ నుండి బియ్యాన్ని లోడ్ చేసి గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు తెలిపాడు. ఈ ఘటన అత్యావశ్యక వస్తువుల చట్టం,1955 సెక్షన్ 3 మరియు 7 కింద నేరం కావడంతో బియ్యం యజమాని, వాహన యజమాని మరియు డ్రైవర్ పై ఫిర్యాదు అందజేయడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్ ఐ ఆర్ సదస్సులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

**వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**జూలూరుపాడు: జూలై 15 ( తెలంగాణ వాణి):**

ఈరోజు మండల పరిధిలోనే ఆర్యవైశ్య కళ్యాణమునకు నందు నిర్వహించిన ఎస్ ఐ ఆర్ ఓటర్ల సదస్సు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొని, బి ఎల్ ఓ, బి ఎల్ ఎ, సూపర్వైజర్లు,23 గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శిలు, ప్రజా ప్రతినిధులతో సమావేశమై, ఈనెల 18వ తారీఖు దాకా ప్రతి గ్రామ పంచాయతీలలో ఎస్ ఐ ఆర్ ఫామ్ను ప్రతి ఇంటింటికి వెళ్లి పూర్తి చేయాలని సూచించారు. ఎవరికైనా ఇబ్బందికరంగా ప్రజాప్రతినిధులతో బిఎల్వోలు గాని బిఎల్ఎలుగాని కార్యదర్శులు గాని తమ నిధుల పట్ల ఎవరైనా అభ్యంతరాలు పెడితే నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి, వాళ్లకు అండగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే శంభుని గూడెం, నల్ల బండ బోడు, గుండ్లరేవు, మాచినేని పేట తండా ఈ గ్రామాలలో తొంబై ఐదు శాతం ఎస్ ఐ ఆర్ లను పూర్తి చేశారని ఆ గ్రామాల వారిగా అధికారులను కృతజ్ఞతలు అని తెలిపారు. ఎస్ ఐ ఆర్ అనేది కేంద్రం ఒక దురద్వేషంతో తీసుకొచ్చిందని మోడీ , అమిత్ షా కుట్రపూరితమైన ప్రజల పట్ల కక్ష సాధింపుతో అనేక రకాలుగా పథకాలు పేర్లతో మోసం చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాములో ప్రజలకు అండగా అనునిత్యం, సేవలు అందించడమే తన లక్ష్యం అంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , అనునిత్యం ప్రజల కోసం తాపత్రయం పడుతున్నారని, ప్రజలకు ఏదో ఒక రకంగా అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని, చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జూలూరుపాడు మండల ప్రజలకు ఎస్ఐఆర్ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకొని ఆ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల వాసులకు సూచించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఎవరైతే చెయ్యకపోతే నిర్లక్ష్యం వహిస్తే, ఆ అధికారి కి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు కూడా సూపర్వైజర్‌గా ఎవరైతే విధులు నిర్వహిస్తున్నారు వారి విధులు వెంటనే పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యం వహించిన సహించలేదు, ఇచ్చిన పని సక్రమంగా సమయానికి పూర్తి చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ ఐ ఆర్ నో పూర్తి చేసిన వెంటనే ఇందిరమ్మ ఇండ్లు ఐటిడిఏ ద్వారా ఇస్తానని, మరియు ఏ అభివృద్ధి కార్యక్రమం కావాలన్నా చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాళ్లూరి రవి, తాసిల్దార్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మంగీలాల్ నాయక్, మాజీ ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూదన్ రావు, అమృ, ఆర్కే నాయుడు , ఏఎస్ఐ మరియు వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
గురువారం । 16 । జూలై । 2026

## కేజీబీవీ విద్యార్థినులకు ప్రాథమిక వసతుల పంపిణీ

### పాల్గొన్న సర్పంచ్ బోడ బాలు నాయక్, వార్డు సభ్యులు మూడ్ గణేష్ చౌహాన్



టేకులపల్లి, జూలై 15:(తెలంగాణ వాణి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం హాస్టల్ విద్యార్థినులకు మంగళవారం ప్రాథమిక వసతుల పంపిణీ కార్యక్రమం అత్యంత అభినందనీయంగా జరిగింది. సమగ్ర శిక్షా అభియాన్ మరియు తెలంగాణ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల నిబంధనల ప్రకారం హాస్టల్‌లో నివసిస్తున్న ప్రతి బాలికకు ఉచితంగా స్కూల్ యూనిఫాం బట్టలు,బెడ్‌షీట్లు(చెద్దర్లు),మరియు దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థినులందరిలో క్రమశిక్షణ,సమానత్వాన్ని పెంపొందించేందుకు ఈ యూనిఫాం దుస్తులు ఎంతగానో తోడ్పడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ...తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం అందిస్తున్న ఈ రకమైన సహాయం గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాల విద్యార్థినుల ఉన్నత చదువులకు,వారి సాధికారతకు ఎంతో దోహదపడుతుందని కొనియాడారు. కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా కేజీబీవీల్లో వసతులు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాకా,టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్ టేకులపల్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మూడ్ గణేష్ చౌహాన్,కేజీబీవీ హాస్టల్ ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం,విద్యార్థినులకు దుస్తులు కుట్టిన ట్రైనీలు, దర్జీలు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కష్టాలు

- ఎరువులు, విత్తనాల కొరతతో అప్పల ఊబిలో ఉన్న రైతులు
- సబ్సిడీపై నాణ్యమైన సరుకులు ఇవ్వాలని తహశీల్దార్ వినతి





కన్నాయిగూడెం,జులై15(తెలంగాణ వాణి):

ములుగు జిల్లాలో తొలకరి జల్లులతో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. పొలాల్లో సేద్యపు హడావుడి కనిపిస్తున్నప్పటికీ రైతాంగం మాత్రం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. సకాలంలో నాణ్యమైన ఎరువులు,విత్తనాలు అందక,బ్యాంకు రుణాలు రాక,గిట్టుబాటు ధర లేక అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

**రెట్టింపు ధరలకు ఎరువుల విక్రయం**

ఈ సీజన్‌లో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న స్టాక్ ను కూడా వ్యాపారులు రెట్టింపు ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. మార్కెట్‌లో నాణ్యత లేని విత్తనాలు ఎక్కువగా ఉన్నాయని, సరైన గుర్తింపు లేని విత్తనాలు కొని చేతులు కాల్చుకుంటున్నామని వాపోయారు. దీంతో పెట్టుబడి భారం గణనీయంగా పెరిగిపోయిందని తెలిపారు.

**బ్యాంకు రుణాలు రాక ప్రైవేట్ అప్పులు**

ఇప్పటికే అప్పుల్లో ఉన్న రైతులకు బ్యాంకుల ద్వారా సకాలంలో రుణాలు మంజూరు కావడం లేదు. దీంతో అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోంది. పండించిన పంటకు మద్దతు ధర లేకపో వడంతో పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదు. ఫలితంగా వ్యవసాయమే దండగ అనే నిరాశలో కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సంఘం ఆందోళన వ్యక్తం చేసింది ఈ సందర్భంగా తెలంగాణ రైతు కూలీ సంఘం ములుగు జిల్లా కార్యదర్శి పల్లెబోయిన స్వామి మాట్లాడుతూ, ఖరీఫ్ దృష్ట్యా ప్రతి రైతుకు సకాలంలో సబ్సిడీపై నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పించాలని, పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయించాలని కోరారు. రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. చిన్న, సన్నకారు రైతులకు రెవెన్యూ శాఖ అధికారులు పహానీల నకళ్లను ఉచితంగా వెంటనే అందించాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోకపోతే రైతు సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# ప్రజా సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ధర్నా

### - కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు



చౌటుప్పల్ జులై 15 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)

మునుగోడు నియోజకవర్గం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వలిగొండ రోడ్డులో మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి బుధవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ధర్నా కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యం, నిర్లక్ష్యం, అక్రమ నిర్మాణాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు చేశారు.

**వలిగొండ జాతీయ రహదారి పనుల్లో తీవ్ర జాప్యం**

తాను ఎమ్మెల్యేగా ఉన్నసమయంలో వలిగొండజాతీయ రహ దారి నిర్మాణానికి అనుమతులు తీసుకువచ్చి పనులు వేగంగా జరిగేలా కృషి చేశానని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్య వైఖరి కార ణంగారహదారిపనులుతీవ్రజాప్యానికిగురయ్యాయని విమ ర్శిం చారు. దీంతోప్రజలునిత్యంఇబ్బందులుపడుతున్నారని అన్నారు.

**మూడు వెంట్లు కాదు ఆరు వెంట్లతో కల్వర్టు నిర్మించాలి**

వలిగొండ రోడ్డులో కాలువపై నిర్మిస్తున్న కల్వర్టులో కేవలం మూడు వెంట్లు మాత్రమే ఏర్పాటు చేయడం ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు. భారీ వర్షాలు లేదా వరదల సమయంలో కాలువ నీరు సరిగా వెళ్లక వెనుక ఉన్న కాలనీలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మూడు వెంట్ల స్థానంలో కనీసం ఆరు వెంట్లు ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మించాలని సంబంధిత డీఈలు, అధికారులకు సూచించినట్లు తెలిపారు.

**కాలువ భూమిలో అక్రమ నిర్మాణాలు వెంటనే చర్యలు తీసుకోవాలి**

కాలువకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తూ ఒక పుర కౌన్సిలర్ 200 గజాలకు మాత్రమే అనుమతి తీసుకుని దాదాపు 500 గజాల్లో భారీ అక్రమ భవనం నిర్మిస్తున్నారని ఆరోపిం చారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీంతో ప్రజలను తప్పుదోవ పట్టించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫిర్యాదులు చేసినా చర్యలు లేవుఈ అక్రమ నిర్మాణంపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఒత్తిళ్ల కారణంగానే అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం లభిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరులు అక్రమ కట్టడా లు, భూ దోపిడీలు, అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు.

**బ్రిడ్జి నిర్మాణంలో ట్రాఫిక్ సమస్యలు ప్రమాదాల ముప్పు**

చౌటుప్పల్‌లో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనుల కారణంగా ట్రాఫిక్ తీవ్రంగా అంతరాయం కలుగుతోందన్నారు. సర్వీస్ రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లడంతో ద్విచక్ర వాహనదారులు డ్రైనేజీ పిల్లర్లపై ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో కొన్ని చోట్ల పిల్లర్లు కుంగిపోయి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే తాత్కాలిక భద్రతా చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

**మంత్రి పదవిపైనే దృష్టి ప్రజా సమస్యలపై లేదు**

స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ప్రజల సమస్యల కంటే మంత్రి పదవిపైనే ఆసక్తి ఎక్కువగా ఉందని కూసుకుంట్ల ప్రభా కర్ రెడ్డి విమర్శించారు. గత 15 సంవత్సరాలుగా మునుగోడు నియోజకవర్గానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి తీసుకురాలేకపోయారని ఆరోపించారు. ప్రజల కష్టాలు పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.

పుర చైర్మన్‌ను డమ్మీగా మార్చారు

చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్‌కు అధికారాలు లేకుండా కొంత మంది డమ్మీగా మార్చారని ఆరోపించారు. ప్రజా ప్రతినిధులకు తగిన అధికారాలు ఇవ్వకుండా అభివృద్ధి కార్యక్ర మాలను అడ్డు కుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం తక్షణ చర్యలు అవసరంఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సం బంధిత అధికారులు స్పందించి వలిగొండ రహదారి, కల్వర్టు, బ్రిడ్జి నిర్మా ణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అక్రమ నిర్మా ణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, చౌటుప్పల్ అభివృద్ధిని పార దర్శకంగా చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, ఉదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజ రత్నం, మున్సిపల్ పట్టణ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, మండల అధ్యక్షులు, దండు మల్కాపురం సర్పంచ్ నిరంజన్ గౌడ్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిదులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్ విద్యాచందన



టేకులపల్లి, జూలై15 (తెలంగాణ వాణి)

మండల పరిధిలో కొనసాగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు),జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారిణి విద్యాచందన ఆదేశించారు. బుధ వారం ఆమె పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) శ్రీనివాస్‌తో కలిసి టేకులపల్లి మండలంలో విస్తృతం గా పర్యటించి,పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. కొప్పురాయి గ్రామపంచాయతీ పరిధిలోని థార పాడు, లక్ష్మీపురం గ్రామాలలో, బోడు గ్రామపంచాయతీ పరిధిలో గోలియాతండ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న గ్రామ సమాఖ్య భవనాలను ఆమె నిశితంగా తనిఖీ చేశారు. గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలను ఈ నెల ఆఖరి నాటికి ఎలాంటి ఆలస్యం లేకుండా పూర్తి చేయాలి. పనుల్లో వేగం పెంచేలా సంబంధిత కాంట్రాక్టర్లు, సప్లయర్లు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లుల ప్రక్రియను వెంటనే పూర్తి చేసి నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించాము. అనంతరం టేకులపల్లి మూడ్ కాలనీలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినుల కోసం యూనిఫామ్‌లు తయారు చేస్తున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ సందర్శించారు. కుట్టు పనుల నాణ్యతను పరిశీలించి,గడువులోగా పాఠశాల విద్యార్థినులకు యూనిఫామ్‌లు అందేలా చూడాలని అక్కడి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ పర్యటనలో టేకులపల్లి ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి,పంచాయతీరాజ్ ఏఈ నవీన్,ఏపీవో కాళంగి శ్రీనివాస్,ఈసీ తిరుపతయ్య,ఏపీఎం కరుణాకర్,సర్పంచ్ పోడెం స్వరూప,పంచాయతీ కార్యదర్శులు సన్యాసి,లక్ష్మణ్,టీఏ ఈశ్వరి,సీసీలు సునీల్,బాయమ్మ,నాగేశ్వరరావు,ఎఫ్ఏ నరేష్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.



# సింగరేణిలో సర్ఫేస్ టు సర్ఫేస్ బదిలీలపై అధికారుల నిర్ణయం ఏమిటీ ?

- జెవిఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తారా?
- యాజమాన్యం నిర్ణయం కోసం కార్మికుల ఎదురుచూపులు





కొత్తగూడెం సింగరేణి, జూలై 15 (తెలంగాణ వాణి)

సింగరేణి సంస్థలో సర్ఫేస్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు సర్ఫేస్ టు సర్ఫేస్ బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. సత్తుపల్లిలో ప్రస్తుతం జేవిఆర్ ఓసిలో పనిచేస్తున్న కార్మికులు గతంలో తమకు కొత్తగూడెంలోని కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులు, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ వంటి కారణాలతో కొత్తగూడెంకు బదిలీలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరుతున్నారు. రోజువారీ దూర ప్రయాణంతో సమయం, ఖర్చు పెరగడంతో పాటు కుటుంబానికి తగిన సమయం కేటాయించలేకపోతున్నామని వారు చెబుతున్నారు. ముఖ్యంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తమ తల్లితండ్రుల కోసం తగిన సమయాన్ని కేటాయించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారదర్శక విధానంలోనే సర్ఫేస్ టు సర్ఫేస్ బదిలీలు వెంటనే జరపాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాన్ని అందిస్తున్నారు. గతంలో యాజమాన్యం తమకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ తమకు బదిలీలలో ప్రాధాన్యత ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో రాజకీయ పార్టీల ఏజెంట్లు క్రియాశీలక పాత్ర పోషించాలి



### డిజిటలైజేషన్ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలి

### ఎన్నికల నమోదు అధికారి, ఆర్డీవో కృష్ణవేణి

ములుగు, జులై15 (తెలంగాణ వాణి)

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ2026 కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ,డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎన్నికల నమోదు అధికారి,ఆర్డీవో కృష్ణవేణి అన్నారు బుధవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ2026 కార్యక్రమంలో భాగంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల నమోదు అధికారి,ఆర్డీవో కృష్ణవేణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసేందుకు కేవలం వారం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున ప్రజలను చైతన్యపరుస్తూ,వార్డు వారీగా బీఎల్ఏలు,బీఎల్‌వోలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ,డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ములుగు మున్సిపాలిటీ,గోవిందరావుపేట మండలం పస్రాబ గ్రామం,ఏటూరునాగారం మండలం ఏటూరునాగారం గ్రామం,మంగపేట మండలం కమలాపూర్ గ్రామ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు మరింత చొరవ చూపి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించడం,వాటిని సంబంధిత బీఎల్‌వోలకు అందజేయడం ద్వారా నిర్ణీత గడువులోపు డిజిటలైజేషన్ పూర్తి చేసేలా సహకరించాలని కోరారు.

# బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘుపతి రెడ్డికి నివాళులు



తల్లాడ, జులై 15 (తెలంగాణ వాణి)

తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దగ్గుల రఘుపతి రెడ్డి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న సత్తుపల్లి సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్ట రాగమయి , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుల దయానంద్ బుధవారం రఘుపతి రెడ్డి పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలానికి రఘుపతి రెడ్డి చేసిన సేవలను కొనియాడారు . తల్లాడ మండలంలో జరిగే ప్రతి కార్యక్రమంలో రఘుపతి రెడ్డి చురుగ్గా పాల్గొనే వారన్నారు. తల్లాడ మండలం ప్రజాదరణ కలిగిన నాయకుడిని కోల్పోయిందన్నారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మిరెడ్డి తల్లాడ మండలం ముఖ్య నాయకులు, మున్సిపల్ చైర్మన్లు,ఏఎంసీ చైర్మన్లు, తల్లాడ మండలం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామపంచాయతీ సర్పంచులు ఉపసర్పంచ్లు వార్డు మెంబర్లు కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.